క్లుప్తంగా

పోచమ్మా.. సల్లంగా చూడమ్మ



పోచమ్మకు ఆర్యవైశ్య మహిళల పూజలు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు పోచమ్మకు ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

'ప్రయోగాత్మక బోధన ఎంతో మేలు'

దండేపల్లి: సైన్స్ పాఠాలను ప్రయోగాల ద్వారా బోధించడంతో విద్యార్థులకు సులభతరంగా అర్థం కావడంతో పాటు, గుర్తుంచుకుంటారని ఎస్సై ఉదయ్‌కిరణ్ అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో 'బడి బాగులో నేను' అనే కార్యక్రమం ద్వారా దాతలు అందించిన సాయంతో పాఠశాలలో కొత్తగా సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు యశోద, సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం బుచ్చన్న, ఉపాధ్యాయురాలు కల్పన, సీఆర్పీ సురేందర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన రామగుడుగు రాజేశం–సుజాత దంపతుల కూతురు రక్షిత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.2.50లక్షలు ఎల్‌వోసీ పత్రాన్ని రక్షిత తల్లిదండ్రులకు గురువారం అందజేశారు.

నేడు నెన్నెలకు ఎమ్మెల్యే వినోద్ రాక

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శుక్రవారం నెన్నెలలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఆయన పీఏ రామకృష్ణ తెలిపారు. బెల్లంపల్లి నుంచి మధ్యాహ్నం 1గంటకు నెన్నెలకు చేరుకొని సాయంత్రం 4గంటల వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు

తాండూర్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాండూర్ మండల ప్రత్యేక అధికారి గజానంద్ సూచించారు. స్థానిక అధికారులతో కలిసి గురువారం కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ప్రభాకర్, ఏ.ఈ విష్ణు కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమన చైతన్య పాల్గొన్నారు.

నియామకం

నస్పూర్: రాష్ట్ర తెలంగాణ కళావేదిక మహిళా అధ్యక్షురాలిగా పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన బత్తుల శారద నియామకం అయ్యారు. శారద మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'వీధికుక్కల నుంచి ప్రజలను రక్షించండి'

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24వార్డుల్లో వీధికుక్కలు, పందులు, దోమలు విపరీతంగా ఉన్నాయని, వాటి వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందని రక్షణ కల్పించాలని బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ ఇంజనీర్ అచ్యుత్‌కు గురువారం వినతిపత్రం అందించారు.

రోడ్డెక్కిన సాగునీరు!



దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో కడెం డిస్ట్రిబ్యూటరీ 28వ కాల్వలో చెత్త తట్టుకోవడంతో, సాగునీరు ముందుకెళ్లలేదు. దండేపల్లి ఆంధ్రకాలనీ వద్ద సాగునీరంతా గురువారం రోడ్డుపై ప్రవహించింది. నీరంతా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గమనించిన ఎంపీడీవో ప్రసాద్, స్థానిక పంకార్యదర్శి శ్రీలతకు సమాచారం అందించి, జీపీ సిబ్బందితో కాల్వలో తట్టుకున్న చెత్తను తొలగించి, సాగునీరు రోడ్డుపైకి రాకుండా చేశారు.

కర్షకులకు కరెంట్ కష్టాలు..!



నా పేరు కోట ధనుంజయ్. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామం. నాకు ఎకరం పొలం ఉంది. నలుగురు రైతులకు కలిపి వ్యవసాయ బోరు ఉంది. ఆ బోరు నీటి ఆధారంగా ఏటా వరి సాగు చేస్తున్నాం. ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టి కాపర్ వైరు పట్టుకెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయలేదు. తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో వరి నారుమడి సాగు చేసుకోవడానికి ఇబ్బంది అవుతోంది.



చర్లపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- నెలలు గడుస్తున్నా జాడ లేని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- వంగిన విద్యుత్ స్తంభాలు, కిందికి వేలాడుతున్న తీగలతో ప్రమాదాలు
- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు



కంచెలేకుండా ప్రమాదరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బెల్లంపల్లి: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నేలకు వంగిన స్థంభాలను సరి చేసి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరి చేయించడంలో విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతులు ఎన్నిసార్లు గోడు వెళ్లబోసుకున్నా కనికరించడం లేదు. ఎప్పటికప్పుడు దాట వేతకు యత్నిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి, చర్లపల్లి గ్రామాల శివారు ప్రాంతాల్లో పంటలు సాగు చేసుకోవడానికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రెండు వేర్వేరు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఆ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న కాపర్ వైరును పట్టుకెళ్లారు. అగంతకులు ఆ చర్యకు పాల్పడి మూడు నెలల కాలం కావస్తున్నా, ఇంత వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు జరగలేదు. నెలలు గడుస్తున్నా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకపోవడంతో పంటలు సాగు చేసుకోవడానికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు కలిగిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సౌకర్యం లేక ఇప్పటివరకు వరి నారుమడులు కూడా పోసుకోలేక సతమతమవుతున్నారు. విద్యుత్ శాఖ మండల ఏఈ, లైన్‌మెన్‌ల దృష్టికి ఎన్నిమార్లు తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

జీవాల ప్రాణాలు పోతున్నా..

ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా, సరిగ్గా పాటించడం లేదు. అక్కడక్కడా తప్పా మెజార్టీ ట్రాన్స్‌ఫార్మర్లకు సరిగ్గా గద్దెలు నిర్మించకపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూరా కంచెలు నిర్మించకపోవడంతో మూగ జీవాలు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రాణాలు కోల్పోతున్నాయి. దుగినేపల్లి, మాలగురిజాల, రంగపేట, చంద్రవెల్లి, చాకేపల్లి, బుధాకుర్దు, లంబాడి తండా తదితర ప్రాంతాల్లో ఇటీవల చోటు చేసుకోవడం గమనార్హం. నోరులేని జీవాలు మృత్యువాత పడుతున్నా బాధ్యులైన మండల విద్యుత్ అధికారులు, సిబ్బంది బాధ్యత లేకుండా వ్యవహరించడం సర్వసాధారణమైపోతోంది. అసలు గ్రామాల్లో రోజువారీగా పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌లను ఏర్పాటు చేసుకుని విధులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు గ్రామీణులు చెబుతున్నారు. అత్యవసరంగా ఫోన్ చేసినా, సత్వరంగా స్పందించకపోవడం, ఒక్కోసారి ఫోన్ ఎత్తినా నిర్లక్ష్యంగా మాట్లాడటం చేస్తున్నట్లు పల్లె ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించొద్దని చెబుతున్నా మండలంలోని కొంత మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పద్ధతిని మార్చుకోవడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు గ్రామాల వారీగా పర్యవేక్షణ చేసి, కరెంట్ సమస్యలను పరిష్కరించడంతోపాటు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

తీగలు వేలాడుతున్నయ్..

బెల్లంపల్లి మండలంలోని గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ లైన్‌లు పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. దుగినేపల్లి గ్రామ శివారు ప్రాంతం మామిడితోటలో కరెంట్ తీగలు చేతికి తగిలే అంత కిందికి వేలాడుతుండగా, రంగపేట గ్రామ శివారు ప్రాంతం, చంద్రవెల్లి, చాకేపల్లి, కన్నాల, పెర్కపల్లి, బట్వాన్‌పల్లి తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లోని విద్యు త్ స్థంభాలు కొన్ని కిందికి పడిపోతున్నట్లుగా ఉండగా వ్యవసాయ విద్యుత్ లైన్ తీగలు అదే తీరుగా వేలాడుతున్నాయి. విద్యుత్ తీగలు ప టిష్టంగా ఉండటానికి మిడిల్ పోల్స్‌ను ఏర్పా టు చేయాల్సి ఉన్నా, శ్రద్ధపెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాల పరిధిలో మాత్రమే మిడిల్స్ పోల్స్ ఏర్పాటు చేసి, మిగి తా ప్రాంతాలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుండటం విద్యుత్ అధికారులకే చెల్లుబాటవుతోందని గ్రామీణులు పేర్కొంటున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం

రెండు చోట్ల ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైరు పట్టుకెళ్లారు. వీటి స్థానంలో కొత్తగా మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం ప్రతిపాదనలు చేసి పంపాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవలనే మంజూరయ్యాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్లను బిగించలేకపోయాం. మరో నాలుగైదు రోజుల్లో స్తంభాలు ఏర్పాటు చేస్తాం. కరెంట్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– రామ్ మనోహర్, డిస్కం ఏఈ, బెల్లంపల్లి మండలం

విద్యుత్ సమస్య పరిష్కరించండి



విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీకి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలానే కొనసాగుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, మరోవైపు రాత్రుళ్లు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటంలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ని తొలగించి మరొకటి బిగించి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఘనంగా ఉర్సు ప్రారంభం



కవ్వాలి పాడుతున్న గాయకులు

తాండూర్: తాండూర్‌లో ఉర్సు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. హజ్రత్ మగ్దూమ్ షహీద్ బాబా, హజ్రత్ మక్కుషాహీద్ బాబాల దర్గా వద్ద వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఏటా ఆనవాయితీగా నిర్వహించే సందల్ ఉర్సుకు భక్తులు మహారాష్ట్ర, ఇతర సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాబా మజార్ల వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బెంగుళూరు నుంచి కవ్వాలి గాయకులను రప్పించగా కవ్వాలి కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కవ్వాలి ముఖాబిలా హోరాహోరీగా సాగింది. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఖలీల్ పటేల్, ముజాహిద్ పటేల్, అబూ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, సిరంగి శంకర్, దత్తాత్రేయరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



జన్నారం: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రెష్మా



తాండూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటపల్లి/జన్నారం/తాండూర్/బెల్లంపల్లి/కాసిపేట/మంచిర్యాలటౌన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వారోత్సవాలను పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, తప్పనిసరిగా ఐదేళ్ల వరకు బిడ్డకు తల్లి పాలివ్వాలని సూచించారు. గర్భిణులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమాల్లో జన్నారంలో ఐసీడీఎస్ సీడీపీవో రెష్మా, సూపర్వైజర్ పద్మ, పోషన్ అభియాన్ కార్యకర్త లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నవలీల, ఆశ కార్యకర్త తిరుమల, తాండూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, అంగన్‌వాడీ టీచర్ శారద, మంచిర్యాలలో అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఏఎన్‌ఎం సునంద, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం శ్రేణులు

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపిస్తూ గురువారం బెల్లంపల్లిలో బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. బీజేవైఎం శ్రేణులు పాత బస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో సామూహికంగా తరలివచ్చి నిప్పంటించారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కల్యాణి, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

జిల్లాకు నిధులు మంజూరు చేయాలి

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశంలో కొండంగల్ నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏతం శివకృష్ణ, బీజేవైఎం నాయకులు చెగొండ శ్రీనివాస్, విష్ణు, శంకర్, సుమన్, బాపు, శ్రీపాల్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



చెన్నూర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చెన్నూర్/కోటపల్లి: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కోటపల్లి మండలంలోని పార్‌పల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దగ్ధం చేశారు. చెన్నూర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు రాజా రమేశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలుచోట్ల బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిరూరల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని పట్టణంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీకి అభినందనలు తెలుపుతూ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బత్తుల సమ్మయ్య, కౌన్సిలర్ కమల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఘనంగా ఆటో కార్మిక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఆటో డ్రైవర్లు

శ్రీరాంపూర్: ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని శ్రీరాంపూర్‌లో ఘనంగా జరుపుకున్నారు. కృష్ణా కాలనీలోని ఆటో యూనియన్ కార్యాలయం వద్ద గురువారం ఆటో డ్రైవర్లు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాగిడి రాజు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో క్రమ శిక్షణగా మెలుగాలన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆదుకోవడానికి ప్రత్యేక స్కీంలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భోగే సమ్మయ్య, ఉపాధ్యక్షులు మామిడి సదానందం, వెంకటేశ్ ప్రధాన కార్యదర్శి ఎండీ రహీం, సహాయ కార్యదర్శి గుడికందుల తిరుపతి, నాయకులు బద్రం తిరుపతి, వినోద్, చిందం తిరుపతి, బొబ్బల కుమార్ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో గురువారం ప్రపంచ ఆటోడ్రైవర్ల దినోత్సవాన్ని ఆటో డ్రైవర్లు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆటో స్టాండ్, తిలక్‌నగర్, మార్కెట్ అడ్డా ఆటోస్టాండ్‌లలో జెండా ఆవిష్కరించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



చెన్నూర్: స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

భీమారం/జన్నారం/లక్సెట్టిపేట/కాసిపేట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు, సంబురాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మందకృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితంగా వర్గీకరణను సాధించుకున్నామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

చెన్నూర్: మాదిగ అమరుల త్యాగ ఫలితమైన ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్–టీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుపై చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు.

ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) ఆధ్వర్యంలో ధర్మ దీక్ష జరిగింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి దీక్ష చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ పోరాట ఫలితంగానే వర్గీకరణ జరిగిందని, సుప్రీంకోర్టు తగిన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంపల్లికి చెందిన చిలుక రాజనర్సు, మాదిగ హక్కుల దండోరా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన డీపీవో



భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న డీపీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, పొక్కూరు, కొమ్మెర గ్రామాలను డీపీవో డి.వెంకటేశ్వర్ రావు గురువారం సందర్శించారు. కిష్టంపేటలో జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులు , మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్ పరిశీలించారు. ఎస్‌బీఐ సందర్శించారు. పొక్కూరు, కొమ్మెర గ్రా మాల్లో శానిటేషన్, క్లోరినేషన్ పనులు పరిశీలించా రు. ఎంపీడీఓ మోహన్, ఎంపీవో అజ్మత్‌అలి పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వాలి

భీమిని: ఫర్టిలైజర్ షాపుల్లో కొనుగోలు చేసే విత్తనాలు, మందులకు రైతులకు తప్పనిసరిగా ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వాలని భీమిని మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఫర్టిలైజర్ షాపులను, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను, ఐకేపీ కార్యాలయాన్ని, తెలంగాణ గ్రామీణ బ్యాంకును గురువారం సందర్శించి పలు సూచనలు చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కాసిపేట: మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకున్నప్పుడే వృక్షాలై పర్యావరణ సమతుల్యానికి దోహదపడుతాయని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట మండలం గోండుగూడం కేకే ఓసీ ప్రభావిత గ్రామస్తులకు గురువారం సీఎస్‌ఆర్ పథకం కింద 500పూలు, పండ్ల మొక్కలు ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో క్రీడలను ప్రోత్సహిస్తూ వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచి సెక్రెటరీ సత్యనారాయణ, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, పీఎంఓఏఐ ప్రెసిడెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

జైపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి గణపతి తెలిపారు. జైపూర్ మండలం కుందారం, కిష్టాపూర్, వేలాల గ్రామ పంచాయతీలను గురువారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపుతో కలిసి సందర్శించారు. అమ్మ–ఆదర్శ పాఠశాలల్లో భాగంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. కుందారం గ్రామీణ బ్యాంకును సందర్శించి రైతు రుణమాఫీపై బ్యాంకు అధికారులతో మాట్లాడి 1000మందికి గాను 362మంది రైతులకు రూ.1లక్ష రుణమాఫీ లబ్ధిపొందినట్లుగా తెలిపారు.

గోరింటా సంబురం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఘనంగా గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో రైతులకు వరి కొనలను తుంచుటపై గురువారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు.

పశు యజమానులకు హెచ్చరిక

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై పశువులు తిరిగితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు యజమానులను హెచ్చరించారు. రోడ్లపై పవువులు తిరగడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. రెండు రోజుల్లో పశువుల యజమానులు వారి పశువులను ఇంటి ఆవరణలో కట్టేసుకోకపోతే యజమానులపై చర్యలతో పాటు, పశువులను గోశాలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

దండేపల్లి: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఉదయ్‌కిరణ్ సూచించారు. మండలంలోని గుడిరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

మొక్కలు పంపిణీ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు జ్యోతినగర్, తిలక్‌నగర్, కనకదుర్గా కాలనీలో గురువారం వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. వార్డు ఆఫీసర్ నరేందర్, ముంతాజ్ పాల్గొన్నారు.

సన్మానం

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి కార్యదర్శిగా పనిచేసిన సనందా బదిలీ కావడంతో ఆమెను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. అనంతరం కొత్తగా వచ్చిన కార్యదర్శి సత్యనారాయణకు గ్రామంలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899